# 'పది'లో ప్రథమ స్థానమే లక్ష్యం



- పరీక్షలకు సర్వం సిద్ధం చేస్తున్నాం..
- జిల్లావ్యాప్తంగా 47 కేంద్రాలను ఏర్పాటు చేశాం..
- పరీక్షకు హాజరుకానున్న 8,923 మంది విద్యార్థులు
- నిమిషం నిబంధన అమలులో లేదు..
- 'నమస్తే' ఇంటర్వ్యూలో నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW

నిర్మల్ అర్బన్, మార్చి 12 : 'పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా విద్యార్థులను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపడమే లక్ష్యం. ఇందుకోసం విద్యార్థులను అన్ని రకాలుగా సిద్ధం చేశాం. ఈనెల 18వ తేదీ నుంచి జరుగనున్న పరీక్షలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశాం. పది పరీక్షలకు నిమిషం నిబంధన అమలులో లేదు. విద్యార్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతిస్తాం. గంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకుంటే బాగుంటుంది.' అని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష ఏర్పాట్లపై 'నమస్తే'కు ఇంటర్వ్యూ ఇచ్చారు.

**నమస్తే తెలంగాణ : పరీక్షలకు ఏర్పాట్లు ఎలా చేశారు?**

డీఈవో : పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కలిపి 8,923 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో బాలురు 4,903.. బాలికలు 4,614 మంది ఉన్నారు. ఇందుకోసం 47 కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాలకు 47 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 47 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, దాదాపు 500 మంది ఇన్విజిలేటర్లు, కేంద్రంలో 300 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉంటే అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించాం. ఇంకా.. 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్‌లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లను అందుబాటులో ఉంచాం.

**నమస్తే : కేంద్రాలను ఎలా విభజించారు?**

**డీఈవో :** 47 కేంద్రాలను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించాం. కేటగిరీ-ఏలో 22, కేటగిరీ-బీలో 18, కేటగిరీ-సీలో ఏడు కేంద్రాలుగా విభజించాం. ఇందులో కేటగిరీ-సీ సెంటర్స్‌పై దృష్టి సారించాం. ఈ కేంద్రాల్లో తపాల కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లు అందుబాటులో లేకపోవడంతో ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్, ఏడుగురు కస్టోడియన్స్‌ను నియమించాం.

**నమస్తే : మాస్ కాపీయింగ్ నిరోదానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?**

**డీఈవో :** మాస్ కాపీయింగ్‌ను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అధికారులకు నిబంధనల గురించి శిక్షణ ఇచ్చాం. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశాం. కేంద్రాల్లోకి కలెక్టర్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డీఈవోలతోపాటు ఎవరివి కూడా మొబైల్ ఫోన్‌లను అనుమతించం. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిత్యం తనిఖీలు నిర్వహిస్తాయి. ఇందులో తహసీల్దార్, ఎస్సై స్థాయి అధికారి, విద్యాశాఖ అధికారులు ఉంటారు.

**నమస్తే : వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటీ?**

**డీఈవో :** విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు మూడు గ్రాండ్ టెస్టులను నిర్వహించాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాం. స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశాం. విద్యార్థులను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించాం.

**నమస్తే : నిమిషం నిబంధన అమలులో ఉందా?**

**డీఈవో :** పది పరీక్షలకు నిమిషం నిబంధన అమలులో లేదు. విద్యార్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతిస్తాం. దాదాపు ఆలస్యం కాకుండా చూసుకోవాలి. గంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకుంటే బాగుంటుంది.

**నమస్తే : హాల్‌టికెట్‌ల పంపిణీ, ఇబ్బందులపై ఏమంటారు?**

**డీఈవో :** అన్ని పాఠశాలల్లో హాల్‌టికెట్‌ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతున్నది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లిస్తేనే హాల్‌టికెట్‌లు ఇస్తామని ఒత్తిడి తెస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రైవేట్ పాఠశాలలు హాల్‌టికెట్‌లను ఇవ్వకపోతే నేరుగా నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ఎవరి సంతకం లేకుండా పరీక్షకు హాజరుకావచ్చు.

**నమస్తే : విద్యార్థులకు ఏమి చెప్పదలుచుకున్నారు?**

**డీఈవో :** ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఆర్టీసీ వారు అన్ని రూట్లలో బస్సులు నడుపుతున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసేందుకు కెరీర్ గైడెన్స్ వారితో అవగాహన సదస్సులు కూడా నిర్వహించాం. వారిని మానసికంగా సిద్ధం చేశాం. ఆల్ ది బెస్ట్.



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

## అలరించిన కుస్తీ పోటీలు

కుభీర్, మార్చి 12 : పార్డి(బీ) గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలను నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి మల్లయోధులు వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో హమీద్‌పై సాయినాథ్ విజయం సాధించగా.. ఆయనకు ఆలయ కమిటీ రూ.8 వేలు అందజేసింది. ఆలయ చైర్మన్ మోహన్, నాయకులు తూం రాజేశ్వర్, సురేశ్, బాబు, పోశెట్టి, మల్లన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి..

- మౌలిక సదుపాయాలను కల్పించాలి..
- కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 12 : ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో విద్యార్థుల ఆరోగ్యం, తాగునీటి వసతి, బియ్యం, ఆహార పదార్థాల నాణ్యతపై సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా పాఠశాలలు, గురుకులాల అధికారులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. పాఠశాలకు తాగునీటిని మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేయాలన్నారు. ఆర్వోఆర్ ప్లాంట్స్ రిపేర్‌లో ఉంటే, వాటిని వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. ప్రతి గురువారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్ ఫీల్డ్ విజిట్‌తో పాటు పాఠశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఐవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు



ఆదిలాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో జీరో బిల్లులు, రూ.500 సిలిండర్ కోసం రెండో సారి వివరాలు నమోదు చేసుకుంటున్న ప్రజలు

# సగం మందికే గృహజ్యోతి

**ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు చేసుకున్నది ఏడు లక్షల పైచిలుకు**

**అర్హత సాధించినది నాలుగు లక్షల మందే..**

**ఉచిత కరెంట్ కోసం క్యూలు కడుతున్న జనం**

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, మార్చి 12(నమస్తే తెలంగాణ ) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు జనాలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎంతో ఆర్భాటం చేసి తీసుకొచ్చిన గృహజ్యోతి పథకం అందరికీ రావడం లేదు. 200 యూనిట్ల లోపు కరెంట్ వాడుకున్న వారికి ఈ నెల బిల్లు వచ్చింది. దీంతో జనం హైరానా పడిపోతున్నారు. పక్కింటి వాళ్లకు రాయితీ ఇచ్చి మాకు ఎందుకు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఉచిత కరెంట్ మేము ఏమైనా అడిగామా.. ఇచ్చేటోళ్లు అందరికీ ఇవ్వాలే గానీ ఒకరికిచ్చి ఇంకొకరికి ఇవ్వకపోవడం ఏంటని మండి పడుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గృహజ్యోతి(200 యూనిట్ల ఉచిత కరెంట్)కు 7,10,212 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో 4 లక్షల మందికే జీరో బిల్లులు వచ్చాయి. దీంతో వైట్ రేషన్ కార్డులు ఉండి కూడా అర్హత సాధించ లేకపోయినోళ్లు మళ్లీ ఇప్పుడెళ్లి ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు బారులుదీరుతున్నారు.

| జిల్లా | వచ్చిన అప్లికేషన్లు | ఫ్రీ కరెంట్ వస్తున్నోళ్లు |
|---|---|---|
| ఆసిఫాబాద్ | 1,13,260 | 64,379 |
| నిర్మల్ | 2,26,586 | 1,77,486 |
| ఆదిలాబాద్ | 1,61,366 | 61,000 |
| మంచిర్యాల | 1,91,000 | 98,000 |
| మొత్తం | 7,10,212 | 4,00,865 |

**వివిధ కారణాలతో నిలిచిన మంజూరు**

ఆసిఫాబాద్‌లో 1,26,706, నిర్మల్‌లో 2,08,486, మంచిర్యాలలో 2,19,184, ఆదిలాబాద్‌లో 1,91,772 మొత్తంగా 7.50 లక్షల కుటుంబాలు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్నాయి. వీరిలో ఏడు లక్షల మంది ప్రజాపాలనలో ఉచిత కరెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ.. ఈ నెల ఇప్పటి వరకు వచ్చిన కరెంట్ బిల్లుల్లో 4 లక్షల మందికి మాత్రమే ఫ్రీ ఇచ్చారు. మిగిలిన వారిలో చాలా మందికి 200 యూనిట్లలోపు ఉన్నప్పటికీ బిల్లు మాత్రం ఎప్పటి మాదిరిగానే వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 6 లక్షల పైచిలుకు కరెంట్ బిల్లులు జనరేట్ చేస్తే ఇందులో 60 శాతం మందికి మాత్రమే ఫ్రీ వచ్చినట్లు సమాచారం. మిగిలిన వారికి బిల్లు యథావిధిగా వచ్చింది. ఇక ఇప్పటి వరకు బిల్లులు రానివాళ్లలోనూ సగం మంది మాత్రమే అర్హులుంటారని తెలుస్తున్నది. దాదాపు వచ్చిన అప్లికేషన్లలో 200 యూనిట్ల లోపు కరెంట్ వినియోగించుకునే వాళ్లే 95 శాతానికి పైగా ఉన్నారు. కాకపోతే ఇందులో కొందరికి తెల్లరేషన్‌కార్డులు లేకపోవడం, ఆధార్‌కార్డు నంబర్లు సరిగా ఎంటర్ చేయకపోవడం, కస్టమర్ ఐడీ సరిగా ఇవ్వకపోవడం మొదలైన కారణాలతో ఉచిత కరెంట్ అనేది మంజూరు కాకపోవచ్చని అధికారులు చెప్తున్నారు. ఒక వేళ అన్ని సరిగ్గా ఉన్నా 200 యూనిట్లు దాటి బిల్లు వచ్చి ఉండొచ్చంటున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించడానికి ప్రజాపాలన సెంటర్లను ఏర్పాటు చేశామంటున్నారు. మరోవైపు గృహజ్యోతి కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సెంటర్లకు జనం పోటెత్తుతున్నారు. మేం వాడుకుంది 200 యూనిట్లలోపే ఉన్నా మాకు బిల్లు వచ్చిందని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రజాపాలన పాత అప్లికేషన్ చూపించి అధికారులను నిలదీస్తున్నారు. చేసేదేం లేక మరోసారి అప్లికేషన్లు పెట్టుకుని నిరాశగా వెనుతిరుగుతున్నారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

## ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి..

ఎదులాపురం, మార్చి 12 : అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, సభ్యులు లింగాల చిన్నన్న, వెంకటమ్మ, సునీత, మధునిక, కవిత, పార్వతి, సుభద్ర, రత్నమాల పాల్గొన్నారు.

**సెల్‌ఫోన్‌లు సరిగ్గా పని చేయడం లేదు..**

అంగన్‌వాడీలకు ఇచ్చిన సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదని ట్యాబ్‌లు ఇవ్వాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ధర్నాలో భాగంగానే ప్రభుత్వ ఇచ్చిన సెల్‌ఫోన్‌లను రోడ్డుపై పెట్టి ధర్నా చేపట్టారు. ట్యాబ్ ఇచ్చి 5జీ సిమ్‌లు ఇవ్వాలన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు రెడీగా ఉండండి..

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**

ఎదులాపురం, మార్చి 12 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కలెక్టర్‌లు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టర్‌లు, అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ముందే గుర్తించాలని తెలిపారు. పోలింగ్ రోజు వెబ్ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆర్వో కార్యాలయంతోపాటు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఈ నెల 13లోగా సమాచా రం పంపించాలన్నారు. వీసీలో అడిషనల్ సీఈవో లోకేశ్, సర్ఫరాజ్ అహ్మద్, కలెక్టర్ రాజర్షి షా, ఐటీ డీఏ పీవో ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మోహతో పాల్గొన్నారు.



వీసీకి హాజరైన కలెక్టర్, పీవో, అధికారులు

# సీఎంఆర్‌ఎఫ్‌కు మోక్షమెప్పుడు?

- సహాయం కోసం అభాగ్యుల ఎదురుచూపు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి రోగుల వేడుకోలు




నిర్మల్, మార్చి 12(నమస్తే తెలంగాణ) : రోగుల పాలిట వరంగా భావించే ముఖ్యమంత్రి సహాయనిధి డబ్బుల కోసం బాధితులు ఎదురు చూస్తున్నారు. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పరిధిలోని చాలా మంది పేదలు పలు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు పూర్తయినప్పటికీ సీఎంఆర్‌ఎఫ్‌పై విధాన నిర్ణయం తీసుకోకపోవడంపై రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వైద్య చికిత్సల కోసం వెళ్లిన రోగులు అక్కడ ఆరోగ్యశ్రీ సదుపాయం లేనప్పుడు, అలాగే ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ కొన్ని చికిత్సలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని సందర్భాల్లో చికిత్స తీసుకుని వాటి ఒరిజినల్ బిల్లులను అందజేసి సీఎం సహాయనిధి నుంచి డబ్బులను రోగులు పొందుతుంటారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల ద్వారా రోగులు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకుని ఆసుపత్రిలో ఖర్చు అయిన డబ్బులను చెక్కుల రూపంలో పొందేవారు. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్ విడుదల ఊసెత్తడం లేదని పలువురు రోగులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.10 కోట్ల వరకు సీఎంఆర్‌ఎఫ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. రేపో మాపో పార్లమెంటు ఎన్నికల కోడ్ కూడా రానుండడంతో మళ్లీ ఇప్పట్లో ముఖ్యమంత్రి సహాయ నిధి డబ్బులు కనుచూపు మేరలో కూడా లభించే అవకాశం లేదంటున్నారు. తమది పేదల ప్రభుత్వమని చెప్పే సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఆసుపత్రి ఖర్చులను కూడా విడుదల చేయకపోవడం శోచనీయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పెండింగులో ఉన్న సీఎం ఆర్‌ఎఫ్ బిల్లులను క్లియర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**నాలుగు నెలల నుంచి ఎదురు చూస్తున్న..**



*గతేడాది అక్టోబర్ నెలలో నాకు డెంగీ జ్వరం రావడంతో నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న. రక్త కణాలు తగ్గిపోవడంతో ఐదు రోజులపాటు ఐసీయూలో ఉంచి చికిత్స చేశారు. దాదాపు లక్ష రూపాయలు అప్పు చేసి బిల్లు కట్టిన. హాస్పిటల్ వాళ్లు ఇచ్చిన బిల్లులను తీసుకుని గత నవంబర్ నెలలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం అప్లయ్ చేసిన. నాలుగు నెలల నుంచి ఎదురు చూస్తున్న. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాలాంటి పేదోళ్లకు ఆసుపత్రి ఖర్చులు కూడా ఇచ్చేటట్లు లేదు.*

**- షెట్‌పెల్లి రాములు, గంజాల్, సోన్ మండలం.**

**సీఎంఆర్‌ఎఫ్ ఇచ్చి ఆదుకోవాలి..**

*ఆపదలో ఉన్న పేదలకు సీఎంఆర్‌ఎఫ్ సహాయాన్ని అందజేసి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల గురించి పట్టించుకోవడం లేదు. నాకు గత నవంబర్‌లో మోటర్ సైకిల్‌పై పార్డీ నుంచి కుభీర్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముఖంపై గాయాలు కాగా, దవడ పండ్లు ఊడిపోయాయి. దీంతో భైంసాలోని ఆరాధన ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా. రూ.50 వేల వరకు ఖర్చయింది. దవాఖాన బిల్లులు తీసుకుని సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుని మూడు నెలలు దాటింది. నేటికీ నయా పైసా రాలేదు.* **- లంక గంగాధర్, రైతు, పార్డీ(కే), కుభీర్ మండలం.**



మున్సిపాలిటీలోని కౌన్సిల్ హాల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

## అదనపు కౌంటర్లు ఏర్పాటు

**'నమస్తే' కథనానికి స్పందన**

నిర్మల్ అర్బన్, మార్చి 12 : ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు మున్సిపాలిటీలో రెండు కౌంటర్లను మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో 'గృహజ్యోతికి తప్పని తిప్పలు' శీర్షికన వార్తను ప్రచురించింది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో అదనంగా రెండు కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు.

## ప్రభుత్వ భూములను రక్షించాలి..

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

నిర్మల్ టౌన్, మార్చి 12 : ప్రభుత్వ భూముల రక్షణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలతో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి అవి ఆక్రమణకు గురికాకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా చెరువులు, కాలువల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని పేర్కొన్నారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు సమన్వయంతో సర్వే నిర్వహించి, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు కిశోర్‌కుమార్, ఫైజాన్‌అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..

**నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

నిర్మల్ టౌన్, మార్చి 12 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువు కోవాలని పేర్కొన్నారు. మహిళలను గౌరవిం చే విధంగా ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు, సామాజిక సేవా కార్యకర్తలు, మహిళ ఆటో డ్రైవర్లు, ప్రజాప్రతినిధులను సన్మానించారు.అదనపు కలెక్టర్‌లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.